

అధికారి సొంత కారుకు..

అద్దె వాహనాలను వినియోగించాల్సిన అధికారులు.. సొంత కార్లలో పర్యటిస్తూ నిరుద్యోగుల ఉపాధికి గండికొడుతున్నారు.

- 9లో ▸



లారీని ఢీకొన్న బస్సు

ఆగి ఉన్న లారీని ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మరణించారు. మరో 28 మందికి గాయాలయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.7 /24.5

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పాలిసెట్ తొలివిడత సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పాలిసెట్ తొలి దశ సర్టిఫికెట్ల పరిశీలన సోమవారం ముగిసిందని పాలిసెట్ జిల్లా సమన్వయకర్త విజయ్‌కుమార్ తెలిపారు. మూడు రోజుల్లో 452 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలించామని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు గురువారం వరకు కళాశాల వెబ్ ఆప్షన్ ఎంచుకోవాలని సూచించారు. 30వ తేదీన తొలి విడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ధ్రువపత్రాల పరిశీలనలో అధికారులు అజారుద్దీన్, అనిల్ కృష్ణ, సుచరణ్, ఫర్హీన్ ఫాతిమ, కనకరాజు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కామారెడ్డిలో కిసాన్ మేళా

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని కళాభారతి స్టేడియంలో బుధవారం కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు కామారెడ్డి డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్ శరత్ చంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల, హైదరాబాద్‌కు చెందిన జాతీయ మాంస పరిశోధన సంస్థల ఆధ్వర్యంలో ఈ మేళా ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. పశుసంవర్ధక శాఖ, హార్టికల్చర్, ఫిషరీస్, పరిశ్రమల శాఖ, విజయ డెయిరీ, నాబార్డు తదితర సంస్థలు తమ ఉత్పత్తులు, పరికరాలతో స్టాళ్లను ఏర్పాటు చేస్తాయని తెలిపారు. ప్రైవేట్ విత్తనాలు, ఎరువుల కంపెనీలు, వ్యవసాయ పరికరాల, ట్రాక్టర్ల సంస్థలు తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తాయని పేర్కొన్నారు. రైతులు మేళాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తున్నాం'



ఎల్లారెడ్డి: జిల్లాలో 24 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ రమేశ్‌బాబు పేర్కొన్నారు. మంగళవారం ఎల్లారెడ్డి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయంలో ఆయన రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ 11 కేవీ విద్యుత్ లైన్లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో 33 కేవీ సబ్‌స్టేషన్ల పరిధిలో 54 ఫీడర్లలో 47 ఫీడర్లకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. 33 కేవీ సబ్ స్టేషన్లలోని ఫీడర్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే అల్టర్నేట్ ఫీడర్ల ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. ఓవర్ లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న చోట 18 చోట్ల పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామన్నారు. పిడుగుపాటుకు జిల్లాలో ఎక్కువగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలడంతో నిర్మల్ జిల్లా నుంచి 25, కంపెనీల నుంచి 19 ట్రాన్స్‌ఫార్మర్లను తెప్పించామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ గణేష్, ఏఈ సత్యనారాయణగౌడ్ తదితరులున్నారు.

ఏడీకి మెమో

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఏడీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ ప్రజావాణి కార్యక్రమానికి గైర్హాజరైన ఏడీ సుదర్శన్‌రెడ్డికి మెమో జారీ చేశామని ఎస్ఈ రమేష్ బాబు తెలిపారు. విద్యుత్ ప్రజావాణిని సక్రమంగా నిర్వహించాల్సిన అధికారి కార్యాలయానికి గైర్హాజరు కావడంపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకున్నామని పేర్కొన్నారు.

నేడు పాఠశాలల బంద్



కామారెడ్డి టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల పరిష్కారం కోసం బుధవారం పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చామని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ రోహిత్ తెలిపారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలో విలేకరులతో సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో బాత్‌రూంలు, మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని, టీచర్ల కొరత వేధిస్తోందని, స్కావెంజర్లు లేక పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి సర్కారు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని డిమాండ్ చేశారు. బంద్‌కు జిల్లాలోని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల యాజమాన్యాలు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

మార్పు షురూ!

కొత్త కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ రాకతో జిల్లాలో మార్పు మొదలైంది. అధికారులు, ఉద్యోగులు సమయానికి విధులకు హాజరవుతుండడంతో కలెక్టరేట్ కళకళలాడుతోంది. నిన్న, మొన్నటి దాకా ప్రజావాణిని పెద్దగా పట్టించుకోని జిల్లా స్థాయి అధికారులు.. సోమవారం జరిగిన కార్యక్రమానికి అంతా హాజరయ్యారు. కలెక్టర్ ఎప్పుడు ఏ విషయం అడుగుతారోనని అధికారులు సమగ్ర సమాచారంతో సిద్ధంగా ఉంటున్నారు.

కొత్త కలెక్టర్ రాకతో మారిన సీన్

- సకాలంలో విధులకు హాజరవుతున్న ఉద్యోగులు
- ప్రజావాణికి హాజరైన అన్ని శాఖల జిల్లా అధికారులు
- సమీక్ష సమావేశాలకు సమగ్ర సమాచారంతో సిద్ధం



ఎర్రాపహాడ్‌లోని అమ్మ ఆదర్శ పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సాక్షి, కామారెడ్డి : కామారెడ్డి జిల్లా ఏర్పాటైన తరువాత తొలి కలెక్టర్‌గా సత్యనారాయణ బాధ్యతలు చేపట్టారు. ఆయన మూడేళ్ల పాటు పనిచేశారు. ఆయన ఎవరినీ నొప్పించకుండా పనిచేయించడంలో సక్సెస్ అయ్యారు. తర్వాత వచ్చిన కలెక్టర్ శరత్ అధికారులు, సిబ్బందిని పరుగులు పెట్టించారు. విధులలో నిర్లక్ష్యం చేసేవారిపై చర్యలు కూడా తీసుకున్నారు. దీంతో కలెక్టర్ శరత్ అంటే అధికారులు, ఉద్యోగుల్లో కొంత భయం ఏర్పడింది. ఆయన తర్వాత మూడో కలెక్టర్‌గా వచ్చిన జితేష్ వి పాటిల్ రెండున్నరేళ్లకుపైగా పనిచేశారు. ఆయనకు సౌమ్యుడిగా పేరుంది. ఎవరినీ ఏమనకుండా ఎవరి పని వారు చేసుకోవాలని సుతిమెత్తగా చెప్పేవారు. ఒక్కోసారి కింది స్థాయి ఉద్యోగులు చేయాల్సిన పనులు కూడా తానే చేసుకున్న సందర్భాలున్నాయి. దీనిని అలుసుగా తీసుకున్న పలువురు ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించకపోవడం, విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం చేసేవారు. ఆయన బదిలీ కావడం, కొత్త కలెక్టర్ రావడంతో పరిస్థితులు మారిపోయాయి. ఆశిష్ సంగ్వాన్ వచ్చిన రోజు నుంచే జిల్లా అధికారులతో సమీక్షలు నిర్వహించడం, ఆయా పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశిస్తుండడంతో, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరిస్తుండడంతో అధికారుల్లో వణుకు మొదలైంది. జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్ బాధ్యతలు తీసుకుని విధులకు హాజరైన తొలిరోజే వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పలువురు అధికారులకు చురకలు అంటించారు. పని తీరు మెరుగుపరచుకోకపోతే చర్యలు తప్పవని కొందరికి వార్నింగ్ కూడా ఇచ్చారు. కలెక్టర్ రివ్యూలకు వెళ్లిన సందర్భంలో సరైన సమాచారం లేకపోయినా, సరైన సమాధానం చెప్పకపోయినా ఆగ్రహం వ్యక్తం చేస్తుండడంతో సమగ్ర సమాచారంతో నివేదికలను తయారు చేసుకుంటున్నారు.

ప్రజావాణికి పెరిగిన ప్రాధాన్యత

కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని చాలామంది అధికారులు నిర్లక్ష్యం చేశారు. ఫిర్యాదుల పరిష్కారంపై పెద్దగా స్పందించకపోవడంతో చాలా వరకు పెండింగ్‌లో ఉన్నాయి. కొన్ని పరిష్కారమైనా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయలేదని కలెక్టర్ సంగ్వాన్ గుర్తించారు. వెంటనే అందరు అధికారులకు లాగిన్, పాస్వర్డ్‌లు అందించి ఆయా దరఖాస్తులను పరిశీలించి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. మండల స్థాయిలో అధికారులు, డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించడంతో అధికారులు ఆ పనిలో పడ్డారు. అంతేగాక ప్రజావాణి కార్యక్రమం నుంచే అన్ని మండలాల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ప్రజావాణి దరఖాస్తులపై దిశానిర్దేశం చేశారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారని, వాటిని నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. దీంతో ప్రజావాణికి ప్రాధాన్యత పెరిగింది. ప్రజలు కూడా కొత్త కలెక్టర్ చొరవను చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమయపాలన..

కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది చాలా మంది సమయానికి వచ్చేవారు కాదు. ఇష్టారీతిన వచ్చి వెళ్లేవారు. ప్రస్తుతం అందరూ సమయపాలన పాటిస్తున్నారు. కలెక్టర్ ఎప్పుడు ఏ పని మీద ఎవరిని పిలుస్తారో తెలియని పరిస్థితుల్లో అందరూ సకాలంలో విధులకు హాజరవుతున్నారు. కలెక్టర్ ఉదయం టూర్‌లకు వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాల అమలుతీరును పరిశీలిస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత కార్యాలయంలో ఉంటూ, వివిధ శాఖలకు సంబంధించి రివ్యూలు నిర్వహిస్తున్నారు. దీంతో అధికారులు, ఉద్యోగులు కార్యాలయాన్ని వదిలిపెట్టకుండా ఉంటున్నారు.

అంగన్‌వాడీల ద్వారా పూర్వ ప్రాథమిక విద్య

- అంతర్జాతీయ ప్రమాణాలతో కోర్సు సిద్ధం
- వీడియో కాన్ఫరెన్స్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ సంగ్వాన్, అధికారులు

కామారెడ్డి క్రైం : అంగన్‌వాడీ కేంద్రాలలో పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి వాకాటి కరుణ ఆదేశించాచారు. మంగళవారం ఆమె హైదరాబాద్‌నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని చిన్న వయసులో పిల్లలకు నేర్పాల్సిన వ్యక్తిగత పరిశుభ్రత, నైపుణ్యాలతో కోర్సు సిద్ధం చేశామన్నారు. పిల్లలకు నేర్పించాల్సిన అంశాలను వివరిస్తూ అంగన్‌వాడీ టీచర్లకు ప్రత్యేక బుక్‌లెట్ రూపొందించామన్నారు. వచ్చేనెల మొదటి వారం నాటికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్ వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్యపై శిక్షణ పూర్తి చేయాలని కలెక్టర్లకు సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా వాల్ పెయింటింగ్స్ వేయించాలన్నారు. పిల్లలకు ఏకరూప దుస్తులు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లల్లో పోషక లోపాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు త్వరగా దివ్యాంగ సర్టిఫికెట్ అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లానుంచి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఐసీడీఎస్ పీడీ బావయ్య, అధికారులు పాల్గొన్నారు.

బదిలీల కోసం టీచర్ల నిరీక్షణ

- జిల్లాలో 1,661 దరఖాస్తులు
- రెండు రోజుల్లో రానున్న సీనియారిటీ జాబితా



కామారెడ్డి టౌన్: బదిలీల కోసం ఉపాధ్యాయులు నిరీక్షిస్తున్నారు. జిల్లాలో బదిలీల కోసం 1,661 మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నెల 21వ తేది వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు పూర్తి చేసుకోగా జిల్లా అధికారులు ఉన్నతాధికారులకు జాబితాను సమర్పించారు. విద్యాశాఖ ఉన్నతాధికారుల నుంచి బదిలీల సీనియారిటీ జాబితా రావాల్సి ఉంది. ఈ జాబితా కోసం ఉపాధ్యాయులు ఎదురు చూస్తున్నారు. 2024 జూన్ 1 నాటికి ఒకే పాఠశాలలో ఎనిమిదేళ్లు పూర్తి చేసుకున్న వారికి బదిలీ ప్రక్రియలో తొలి ప్రాధాన్యత ఉంటుంది. అలాగే ఒకేచోట కనీసం మూడేళ్లు పనిచేసిన వారికి బదిలీ అవకాశం కల్పించారు. రెండేళ్లు సర్వీస్ పూర్తి చేసుకుని ఆసక్తి ఉన్నవారి నుంచి కూడా దరఖాస్తులను స్వీకరించారు. సీనియారిటీ జాబితా రెండు రోజుల్లో వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా విద్యాశాఖ అధికారులు బావిస్తున్నారు. అయితే బదిలీల ప్రక్రియ ఆలస్యం అవుతుండడంతో ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడం, బదిలీలు పూర్తికాకపోవడంతో కొందరు టీచర్లు వారి పిల్లలను ఏ స్కూల్‌కు పంపించాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు. బదిలీల ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు. బదిలీలలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తామని డీఈవో ఎస్.రాజు 'సాక్షి'తో తెలిపారు. సీనియారిటి జాబితా రాగానే బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు.

ఎమర్జెన్సీని మరచిపోలేం



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

- ప్రజాస్వామ్యంలో చీకటి రోజులవి
- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల

కామారెడ్డి టౌన్: ప్రజాస్వామ్యానికి చీకటి రోజైన ఎమర్జెన్సీని ఎప్పటికీ మరచిపోలేమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. దేశంలో ఎమర్జెన్సీ విధించి యాభై ఏళ్లవుతోంది. ఈ సందర్భంగా జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యెండల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ దేశ ప్రజాస్వామ్య చరిత్రలో 1975 జూన్ 25 చీకటి రోజుగా నిలిచిపోయిందన్నారు. ఆరోజు అటల్ బిహారీ వాజ్‌పేయి, మొరార్జీ దేశాయ్, బిజూ పట్నాయక్, చంద్రశేఖర్ లాంటి వారితో సహా లక్షమందికిపైగా ప్రజలను నిర్బంధించి జైళ్లలో వేశారన్నారు. 'ఎమర్జెన్సీ' అంటే ఇందిరా గాంధీకి పర్యాయపదంగా మారిపోయిందన్నారు. ప్రశ్నించినవారిని జైలుపాలు చేశారని పేర్కొన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడినవారిని గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు విపుల్, ప్రధాన కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, రవీందర్‌రావు, పట్టణ అధ్యక్షుడు భరత్, నాయకులు శ్రీకాంత్, చారి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, రవీందర్, వెంకట్, గంగారెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి

- 'రైతు నేస్తం' సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



ఎర్రాపహాడ్‌లో రైతు నేస్తంలో పాల్గొన్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

తాడ్వాయి : రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. ఈ విధానంలో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందన్నారు. ఎర్రాపహాడ్‌ని రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మాట్లాడారు. రైతు భరోసా కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి విధివిధానాలు ఖరారు చేయడం కోసం రైతులనుంచి సలహాలు, సూచనలు స్వీకరించారు. పదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు రైతు భరోసా అందించాలని రైతులు సూచించారు. పంటల సాగు మొదలవకముందే పెట్టుబడి సాయం అందేలా చూడాలన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకం వర్తింప చేయాలన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తామనడం, వడ్లకు క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రకటించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి పొందేలా రైతులు నూతన వ్యవసాయ విధానాలు అవలంబించాలన్నారు. వరికి ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలన్నారు. మహిళా రైతులు ముందుకు వచ్చి పంటలను సాగుచేయాలని సూచించారు. రైతు నేస్తం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతునేస్తంలో నిష్ణాతులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అందుబాటులో ఉంటారని, వారిని సంప్రదించి సాగులో మెలకువలు, అవసరమైన సలహాలు, సూచనలు పొందవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఏవో భాగ్యలక్ష్మి, డీఈవీ నందు, తహసీల్దార్ రహీమొద్దీన్, ఎంపీడీవో సాజిద్ అలీ, ఏవో శ్రీకాంత్, డీసీఎంఎస్ డైరెక్టర్ కపిల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల తనిఖీ

ఎర్రాపహాడ్‌లోని పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. తరగతి గదులలో ఏర్పాటు చేసిన ట్యూబ్ లైట్లు, ఫ్యాన్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి పాఠశాలలో వసతుల గురించి తెలుసుకున్నారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేపట్టిన తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, ఇతర మరమ్మతు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మిగిలిన పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు.

గతుకుల రోడ్డుపై బతుకు బండి

వందల సంఖ్యలో బస్సులు.. లక్షల మంది ప్రయాణికులు.. వారిని సకాలంలో క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చేందుకు ఆర్టీసీ ఉద్యోగులు అహర్నిశలు శ్రమిస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా పనిలో నిమగ్నమవుతున్నారు. పని భారాన్ని భరిస్తూ ఆర్టీసీ ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించేవారి సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో ఉద్యోగులపై తీవ్ర పనిఒత్తిడి పడింది. వీటన్నింటినీ తట్టుకుని నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నా.. వారి బతుకు బండి సురక్షితంగా సాగడంలేదు. ఒకవైపు తీవ్ర పనిఒత్తిడి, డబుల్ డ్యూటీలు.. మరోవైపు అనారోగ్య సమస్యలు, అధికారుల వేధింపులు, ఇలా అనేక సమస్యలతో ఆర్టీసీ ఉద్యోగులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక కథనం..

ఆర్టీసీ ఉద్యోగులపై తీవ్ర పనిఒత్తిడి

- నిత్యం 350 కిలోమీటర్లకుపైగా డ్యూటీ
- 'మహాలక్ష్మి'తో కిటకిటలాడుతున్న బస్సులు
- టార్గెట్లతో అవస్థలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న డ్రైవర్లు, కండక్టర్లు



ఉమ్మడి జిల్లాలోని డిపోలు, బస్సుల వివరాలు

బస్సు డిపోలు	6
బస్సు రూట్లు	240
బస్సుల సంఖ్య	575
ఆర్టీసీ బస్సులు	410
హైర్ బస్సులు	165
రోజు ఆక్యుపెన్సీ	95
కొత్త బస్సుల ప్రతిపాదనలు	25
కొత్తగా వచ్చిన బస్సులు	18

ఖలీల్‌వాడి: ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని ఆరు ఆర్టీసీ డిపోల పరిధిలో 2400 లమందికిపైగా ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిత్యం 1.90 లక్షల మంది ప్రయాణించేవారు. మహాలక్ష్మి పథకం ప్రవేశ పెట్టిన తర్వాత ఈ సంఖ్య 2.90 లక్షలకు చేరింది. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణికుల సామర్థ్యం 50 మంది వరకు ఉంటుంది. గతంలో సామర్థ్యానికి మించి అదనంగా 10 నుంచి 20 మంది వరకు ప్రయాణం చేసేవారు. ప్రస్తుతం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో 80 నుంచి 100 మంది వరకు ప్రయాణం చేస్తున్నారు. డ్రైవర్లు, కండక్టర్లకు గతంలో 8 గంటల డ్యూటీ ఉండేది. కానీ ఇప్పుడు పని గంటల నిబంధన లేదు. సుదూర ప్రాంతాలకు వెళ్లిన డ్రైవర్లు, కండక్టర్లు డేడ్యూటీ చేస్తారు. కానీ ఉదయం వెళ్లిన వారు అక్కడ ట్రాఫిక్ ఇబ్బందులతో తిరిగి వచ్చేసరికి రాత్రి అవుతోంది. నిజామాబాద్ – హైదరాబాద్ మధ్య అప్ అండ్ డౌన్ 360 కిలోమీటర్లు అవుతుండగా.. నిజామాబాద్ – వరంగల్ మధ్య అప్ అండ్ డౌన్ 460 కిలోమీటర్లు పడుతుంది. ఇలా డ్రైవర్లు, కండక్టర్లు నిత్యం 10 నుంచి 12 గంటల పాటు పని చేస్తున్నారు. దీంతో నిద్ర కరువై అనారోగ్యం బారిన పడుతున్నారు. నిద్రలేమి కారణంగా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. యూనియన్లు లేకపోవడంతో డిపోలోని అధికారులు సిబ్బందికి ఇష్టారాజ్యంగా డ్యూటీలు వేయడంతో పనిఒత్తిడి పెరుగుతోంది.

రోజంతా పని చేస్తేనే.. స్పెషల్ ఆఫ్

కండక్టర్, డ్రైవర్లకు డే డ్యూటీ, నైట్ డ్యూటీ, స్పెషల్ డ్యూటీ ఉంటాయి. రోజంతా పనిచేస్తేనే స్పెషల్ ఆఫ్ ఇస్తారు. అంటే పనిచేసిన మరుసటి రోజు సెలవు ఉంటుంది. అనార్యోగం పాలైన సిబ్బంది సంబంధిత డాక్టర్ల నుంచి మెడికల్ సర్టిఫికెట్ తీసుకురావాల్సి ఉంటుంది. సెలవు కావాలంటే అధికారుల అనుమతి తీసుకోవాలి.

మహాలక్ష్మి పథకం ప్రారంభించడంతో..



మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో రద్దీ బాగా పెరిగింది. ఏ బస్సులో చూసినా మహిళలే ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. సీట్ల కోసం మాటల యుద్ధాలూ జరుగుతున్నాయి. టిక్కెట్ కొనుగోలు చేస్తున్న పురుషులు కూర్చునేందుకు సీట్లు దొరకడం లేదు. దీనివల్ల కూడా వాగ్వాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ పరిస్థితులు ఆర్టీసీ కండర్లు, డ్రైవర్లకు తలనొప్పిగా మారుతున్నాయి. బస్సులో ఎక్కువ సంఖ్యలో ప్రయాణికులు ఉంటుండడంతో బస్సు ఆలస్యం కావడంతో పాటు కేఎంపీఎల్ కూడా రావడం లేదు. విపరీతమైన రద్దీ కారణంగా టికెట్లు ఇచ్చే సమయంలో కండక్టర్లు ఇబ్బందులు పడుతున్నారు. నిర్దేశిత కేఎంపీఎల్ సాధించని డ్రైవర్లకు ఆర్టీసీ అధికారులు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. కండక్టర్లకు మహాలక్ష్మి పథకంతో పాటు టికెట్లకు టార్గెట్ ఇస్తున్నట్లు తెలుస్తోంది. టార్గెట్ చేరుకోకపోతే తాము ఏం చేయగలమని కండక్టర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టార్గెట్లతో డ్రైవర్లు, కండక్టర్లు ఒత్తిడికి గురై అనారోగ్యం బారిన పడుతున్నారు.

క్లుప్తంగా

పెద్దమల్లారెడ్డివాసికి డాక్టరేట్



భిక్కనూరు: పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన బండల సిద్ధరామగౌడ్ డాక్టరేట్ పట్టాను సోమవారం పొందారు. ఆయన డిజైన్ ఆఫ్ నావెల్ ఇన్ ఎక్సీసీఎల్ మిక్స్‌డ్ మెటల్ –బేస్డ్ ఆన్ నాన్ క్రిస్టల్ కాటలిస్టు ఫర్ ద క్యాటలీక్ ఫర్ ద ట్రాన్స్‌ఫర్మేషన్ ఆల్కహాల్ ఆల్ ది ప్రైట్స్ టు ఫైన్ కెమికల్ అనే అంశంపై తెలంగాణ యూనివర్సిటీ కెమిస్ట్రీ అధ్యాపకుడు వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో తన పరిశోధన వ్యాసాన్ని తెలంగాణ యూనివర్సిటీకి సమర్పించారు. దీంతో యూనివర్సిటీ వారు బండల సిద్ధరామగౌడ్‌కు డాక్టరేట్ పట్టాను ప్రకటించారు.

రోడ్లపై వ్యాపారాలతోనే ట్రాఫిక్ సమస్య



కామారెడ్డి టౌన్ : పట్టణంలో రోడ్లపైనే చిరు వ్యాపారులు, కూరగాయాలు విక్రయిండచంలో ప్రజలకు ఇబ్బందులతో పాటు ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. మంగళవారం డైలీ మార్కెట్, సుభాష్‌రోడ్‌ను సందర్శించారు. సుభాష్‌రోడ్‌లో నడిరోడ్డుపై కూరగాయలు విక్రయించవద్దన్నారు. డైలీమార్కెట్‌లో లేదా రైతుబజార్‌లో విక్రయించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, టీపీవో గిరిదర్, కౌన్సిలర్లు రాజునాయక్, అంజల్ రెడ్డి, రాజు, శివ కృష్ణమూర్తి, నాయకులు చంద్రశేకర్‌రెడ్డి తదితరులున్నారు.

బీఆర్ఎస్ నేతకు సన్మానం



కామారెడ్డి టౌన్ : జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎంకే ముజీబొద్దీన్ హజ్ పాదయాత్ర పూర్తిచేసుకుని కామారెడ్డికి వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. తన నివాసంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, జిల్లా అధికార అధికార ప్రతినిధి శ్రీనివాస్ గౌడ్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ కుంభాల రవి యాదవ్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మీర్జా ఆఫీస్ బేగ్ తదితరులున్నారు.

ఆధార్‌తో అవస్థలెన్నో?



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు నిమ్మ పోచవ్వ. దోమకొండ మండలం అంబారిపేటకు చెందిన వృద్ధురాలికి ఇప్పటి వరకు ఆధార్ కార్డు లేకపోవడం విచిత్రం. భర్త కిష్టయ్య బతికున్నప్పుడు ఆయన ఆధార్ కార్డుకు ఐరిస్ రాకపోవడంతో అప్పుడు పోచవ్వ ఐరిస్‌తో దిగింది. భర్త ఆధార్ కార్డుకు ఆమె ఐరిస్ అనుసంధానం కావడంతో ఇప్పుడు ఆమెకు ఆధార్ కార్డు రావడం లేదు. ఆధారే ప్రధానాధారం కావడంతో వితంతు పెన్షన్ రావడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే ఓపిక లేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉంది. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుకుంటోంది.



ఈ ఫొటోలో కనిపిస్తున్న ఆమె పేరు కుంట లావణ్య. దోమకొండ మండలం అంబారిపేటకు చెందిన ఈమె వృత్తిరీత్యా బీడీలు చుడుతూ జీవనం కొనసాగిస్తుంది. బీడీ కంపెనీలో నమోదు చేసిన పుట్టిన తేదీ, ఆధార్ కార్డులో పుట్టిన తేది ఒకటి కాకపోవడంతో ఆధార్‌లో మార్పించుకునేందుకు ఒకటి రెండు సార్లు ప్రయివేటు ఆధార్ సెంటర్లో ఫొటో దిగింది. దీంతో ఎక్కువ సార్లు ఆధార్ కార్డుకు దిగడం వల్ల ఆధార్ అథారిటీ కేంద్రం వారు లావణ్య ఆధార్ కార్డును డీయాక్టివేట్ చేశారు. ఈ కారణంగా వేలి ముద్రలు రాకపోవడంతో ఆమెకు పథకాలు రావడం లేదు.

- పలుమార్లు మార్పుల కోసం ఆధార్ సెంటర్లలో ఫొటోలు దిగిన బాధితులు
- అనేకమార్లు మార్పులు చేయడంతో డీయాక్టివేషన్ మోడ్‌లోకి ఆధార్ కార్డులు
- వేలిముద్రలు రాకపోవడంతో ప్రభుత్వ పథకాలన్నీ కట్
- ఆధార్ కార్డులు సరి చేయాలని వేడుకుంటున్న బాధితులు



బీబీపేట: ఆధార్ కార్డులో చిరునామాల మార్పు, తప్పులను సరిచేసుకునేందుకు ఎక్కువ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామని కేంద్ర ప్రభుత్వం ఓ వైపు ప్రకటనలు చేస్తున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. ఆధార్ కార్డులు మొత్తమే లేకపోవడం, ఉన్నప్పటికీ వేలి ముద్రలు రాకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలకు దూరమవడం లాంటివి చాలా గ్రామాల్లో జరుగుతున్నాయి. దీనికి సంబంధించిన అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లబ్ధిదారులు నష్టపోతున్నారు. గతంలో ఆధార్, మీ సేవ కేంద్రాల వద్ద ఆధార్ కార్డులో మార్పులు, సవరణలు చేసేవారు. ఆధార్ కేంద్రాల నిర్వహణ బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. జిల్లాలోని పలు పోస్టాఫీసులు, బ్యాంకుల్లో ప్రత్యేకంగా ఆధార్ సేవా విభాగాలను సైతం ఏర్పాటు చేశారు. జిల్లాలో చాలా గ్రామాల్లో ప్రజలకు ఆధార్ కార్డులు ఉన్నప్పటికీ వారి వేలి ముద్రలు రాకుండా డీయాక్టివేషన్‌లో ఆధార్ అథారిటీ వారు ఉంచారు. దీంతో ప్రభుత్వ పథకాలకు వారు పూర్తిగా దూరమవుతున్నారు. లబ్ధిదారులు స్థానికంగా ఉండే ఆధార్ కేంద్రాల చుట్టే కాకుండా హైదరాబాద్‌లోని ప్రధాన కేంద్రాలకు సైతం వెళ్లి వెనుకకు వచ్చారు. మరికొంత మందికి పూర్తిగా ఆధార్ కార్డు లేకపోవడంతో వారు మరింత ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

ఎక్కువసార్లు దిగడమే సమస్య

ఆధార్ అథారిటీ కేంద్రం వారు ఆధార్‌లో మార్పుల కోసం ప్రయివేటు సెంటర్ల ద్వారా ఎలాంటి ఆధారం లేకుండా మార్పులు చేసినట్లయితే వారి ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేస్తున్నారు. అంతే కాకుండా ఆధార్ కార్డులో ఏవైనా మార్పులు ఉన్నట్లయితే ప్రభుత్వ ఆధార్ సెంటర్ల వద్ద పూర్తి ఆధారాలతో దిగితే వెంటనే మార్పులు జరుగుతాయి. అలా కాకుండా చాలా గ్రామాల్లో మహిళలు డీయాక్టివేట్ ఆధార్ కార్డులే ఎక్కువగా కలిగి ఉన్నారు. మహిళలు ఎక్కువ శాతం ప్రయివేటు కేంద్రాలను ఆశ్రయించి ఎటువంటి ఆధారాలు లేకుండానే ఆధార్‌లో మార్పుల కోసం ప్రయత్నాలు చేశారు. దీంతో ఎక్కువ సార్లు ప్రయత్నం చేయడంతో ఆధార్ కార్డులను డీయాక్టివేట్ చేశారు.

జనన ధ్రువపత్రాలే ఆధారం

ప్రస్తుతం డీయాక్టివేట్‌లో ఉన్న ఆధార్ కార్డులను సరిచేసుకోవాలంటే దానికి కావాల్సిందల్లా జనన ధ్రువపత్రాలే. మహిళలు చాలా మంది 30 ఏళ్లకు పైబడిన వారు, అందులో విద్యార్హత లేనివారే అధికంగా ఉన్నారు. జనన ధ్రువపత్రం పొంది హైదరాబాద్‌లోని ప్రధాన ఆధార్ కేంద్రం వద్దకు వెళ్తే తప్ప ఆధార్ నమోదు కాదు. దీంతో జనన ధ్రువపత్రానికి తహసీల్ కార్యాలయం వద్ద దరఖాస్తు చేసుకుంటే వస్తుందనుకొని కార్యాలయాల చుట్టూ తిరిగినా రాకుండా పోతోంది. విద్యార్హత లేని వారికి అసలైన ఆధారాలు లేకుండా జనన ధ్రువపత్రం ఇవ్వొద్దని తహసీల్ కార్యాలయ సిబ్బంది వెనక్కి పంపుతున్నారు. 30 ఏళ్ల కింద పుట్టిన వారి వివరాలు జనన ధ్రువపత్రాల రిజిష్టర్‌లో ఉంటాయని, వాటిని తహసీల్ కార్యాలయంలోనే భద్ర పరుస్తారు కాబట్టి ఆ రిజిష్టర్‌లోనైనా చూసి జనన ధ్రువీకరణ పత్రం జారీ చేయాలని పలువురు అధికారులకు మొరపెట్టుకుంటున్నా ఫలితం లేకుండా పోతోంది. అధికారులు దీనిపై దృష్టి పెట్టుకొని సరిచేస్తే తప్ప బాధితులకు న్యాయం జరిగేలా లేదు.

ప్రబలుతున్న డయేరియా

బాన్సువాడ: బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి డయేరియా బాధితుల తాడికి ప్రారంభమైంది. వాతావరణంలో మార్పుల కారణంగా కొన్ని రోజులుగా బాన్సువాడ, జుక్కల్ ప్రాంతాల నుంచి డయేరియా బాధితులు ఆస్పత్రిలో చేరుతున్నారు. గ్రామాల్లో కలుషిత నీటిని సేవించడంతో రోగాల బారిన పడుతున్నట్లు తెలిసింది. ప్రస్తుతం గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుండడంతో రక్షిత మంచినీటి ట్యాంకులను శుభ్రం సరిగ్గా చేయడం లేదు. ఈ కారణంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు వాంతులు, విరేచనాలు, జ్వరాలు రావడంతో ఆస్పత్రికి వస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల్లో దృష్టి సారించకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుందని ప్రజలు అంటున్నారు. వర్షాకాలం దృష్ట్యా గ్రామాల్లో తాగునీరు కలుషితం కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

ఫోన్ల అప్పగింత



భిక్కనూరు: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న ఐదుగురికి తిరిగి ఫోన్లు అప్పగించినట్లు ఎస్సై సాయి కుమార్ సోమవారం తెలిపారు. బస్వాపూర్ గ్రామానికి చెందిన కాసార్ల నర్సాగౌడ్, రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన గంగుల భాస్కర్, దోమకొండ మండలం సీతారాంపల్లి గ్రామానికి చెందిన చెరుకు రాజు, భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన చేగూర్ల ప్రశాంత్, ఎండీ ఆసిఫ్‌లకు తిరిగి సీఈఐఆర్ ద్వారా ఫోన్లను రికవరీ చేసి అప్పగించినట్లు ఎస్సై వివరించారు.

ప్రమాదకర స్తంభాలను తొలగించండి



భిక్కనూరు: పాఠశాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కంచర్ల గ్రామంలో అమ్మ ఆదర్శ పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. అలాగే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలను కల్పించాలన్నారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో ఎల్లయ్య, మిషన్ భగీరథ ఏఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఈవీఎం గోదాం పరిశీలన

కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసు కార్యాలయం సమీపంలో ఉన్న ఈవీఎం గోదాంను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మంగళవారం సందర్శించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని 276, కామారెడ్డి నియోజకవర్గంలోని 274, జుక్కల్ నియోజకవర్గంలోని 262 వీవీ ప్యాట్ల నుంచి థర్మల్ పేపర్ రోల్స్, అడ్రస్ ట్యాగుల తొలగింపు కార్యక్రమాన్ని రాజకీయ పార్టీల ప్రతినిధుల ఆధ్వర్యంలో చేపట్టారు. అనంతరం ఈవీఎం గోదాంకు తాళం వేసి సీజ్ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, ఎన్నికల విభాగం అధికారులు ప్రేమ్‌కుమార్, అనిల్ కుమార్, తహసీల్దార్ జనార్దన్, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాల అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి అనుమతులు

కామారెడ్డి క్రైం: ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి ఉన్న లేఅవుట్‌లకు 21 రోజులలోగా అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి లేఅవుట్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. క్షేత్రస్థాయికి వెళ్లి లేఅవుట్‌లు నిబంధనల ప్రకారం ఉన్నదీ, లేనిదీ పరిశీలించాలన్నారు. నిర్దేశిత సమయంలోగా అనుమతులు ఇవ్వాలన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీలలో 2 చొప్పున లే అవుట్ అనుమతులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

శుక్రవారం తిరిగి సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పటిలోగా లేఅవుట్‌లను పరిశీలించి నివేదించాలని ఆదేశించారు. అండర్ డ్రైనేజీ, విద్యుత్, సెప్టిక్ ట్యాంక్, ఇంకుడు గుంత, పచ్చదనం, 10 శాతం మార్టిగేజ్‌ను పొందుపరచడం తదితర అంశాలను పరిశీలించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో రంగనాథ రావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్అండ్‌బీ ఈఈ రవిశంకర్, జిల్లా నీటిపారుదల అధికారి నరసింహారావు, విద్యుత్ శాఖ ఎస్ఈ రమేష్ బాబు, కలెక్టరేట్ పర్యవేక్షకులు జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ (ఆర్ఎస్ఈటీఐ) ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ కు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరక్టర్ సుంకం శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. ఈ నెల 28 నుంచి టైలరింగ్ (30 రోజులు), జూలై 1 నుంచి బ్యూటీపార్లర్ మేనేజ్‌మెంట్(30 రోజులు) కోర్సుల్లో శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువతులు (19 నుంచి 45 సంవత్సరాలు) శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, రేషన్‌కార్డు, ఎస్సెస్సీ మెమో, 5 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఆర్ఎస్ఈటీఐలో దరఖాస్తు చేసుకోవాలని ఆ యన సూచించారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పిస్తామన్నారు. శిక్షణ అనంతరం ధ్రువీకరణ పత్రం, టూల్ కిట్ అందజేస్తామని, పూర్తి వివరాలకు 08461– 295428ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తులు..

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో పొరుగుసేవల కింద పనిచేయడానికి మూడు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడానికి ఈనెల 29 వరకు దరఖాస్తులు కోరుతున్నట్టు ప్రిన్సిపాల్ నారాగౌడ్ తెలిపారు. ఇంగ్లిష్(టీజీటీ), మ్యాథ్స్(టీజీటీ), ఆర్ట్ టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, వీటి భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్టు, అభ్యర్థులు బీఎడ్ డిగ్రీ కలిగి ఉండాలని పేర్కొన్నారు.

నగరంలో దారుణహత్య

ఖలీల్‌వాడి: నగరంలోని ఆరో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ధర్మపురిహిల్స్ రంజానీ బాబా దర్గా ప్రాంతంలో హాసన్ (50) అనే వ్యక్తిని దుండగులు కత్తులతో పొడిచి, గొంతు కోసి హత్య చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. హాసన్ గత 20 ఏళ్లుగా రంజానీ బాబాదర్గాలో ప్రార్థనలు చేస్తూ ఆవరణలోనే ఉన్న రేకుల షెడ్డులో ఉంటుండగా, కుటుంబ సభ్యులు వేరే ప్రాంతంలో ఉంటున్నారు. సోమవారం రాత్రి రేకుల షెడ్డులో నిద్రిస్తున్న హాసన్‌ను దుండగులు కత్తులతో దాడి చేసి దారుణంగా హత్య చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. పోలీసు జాగిలాలు కొంత దూరంలో ఉన్న రేకుల ఇళ్ల వద్దకు వెళ్లి ఆగిపోయాయి. దర్గాకు వచ్చే డబ్బుల కోసం హత్య చేశారా? లేక ఇతరు కారణాలు ఏవైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్త్ సీఐ సురేశ్, ఎస్సై మొగులయ్య తెలిపారు.

కల్తీ కల్లు విక్రయదారుడిపై చర్యలు తీసుకోవాలి

డిచ్‌పల్లి: మండలంలోని మిట్టాపల్లిలో కల్తీ కల్లు విక్రయిస్తూ ప్రజల అనారోగ్యానికి కారణమవుతున్న మేడిద స్వామిగౌడ్‌పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం వీడీసీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన సుమారు 200 మంది ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, పోలీస్ కమిషనర్, రూరల్ ఎమ్మెల్యేను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు మాట్లాడుతూ.. కల్తీ కల్లును విక్రయించొద్దని స్వామిగౌడ్‌తోపాటు అతడి సోదరుడు శ్రీనివాస్‌గౌడ్ కోరగా.. వీడీసీ సభ్యులపైనే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తాము చేస్తున్న తప్పును కప్పిపుచ్చుకునేందుకు ప్రశ్నించిన వారిపైనే దౌర్జన్యానికి పాల్పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తాను ఆదిలాబాద్ జిల్లాలోని ఓ మండలానికి రిపోర్టర్‌గా పని చేస్తున్నానని, తాను ఏం చేసినా పోలీసులు ఏం చేయలేరని స్వామిగౌడ్ గ్రామపెద్దలను, గ్రామస్తులను బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. వారిద్దరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

క్రైం కార్నర్

రైలు కిందపడి ఆత్మహత్య



ఖలీల్‌వాడి: కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆర్మూర్ పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీకి చెందిన మీర్జా సాజిద్‌బేగ్(45) కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురై నిజామాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలోని మామిడిపల్లి రైల్వేగేట్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ముగ్గురి బైండోవర్



సిరికొండ: మండలానికి చెందిన ముగ్గురు సారా తయారీదారులను తహసీల్దార్ రవీందర్‌రావు ఎదుట భీమ్‌గల్ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం బైండోవర్ చేశారు. ఎక్సైజ్ సీఐ వేణుమాధవ్‌రావు ఆధ్వర్యంలో ముషీర్‌నగర్‌కు చెందిన బట్టు శ్యామల, పిపావత్ మేని, నడ్మితండాకు చెందిన కేతావత్ నర్సిలను బైండోవర్ చేశారు. కానిస్టేబుళ్లు దత్తాద్రి, సుధీర్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం రాత్రి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలు, సిబ్బంది ఎల్లారెడ్డి – కామారెడ్డి రోడ్డుపై వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్ లేని 25 వాహనాలు సీజ్ చేయడంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 13 మందిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేయడంతోపాటు లైసెన్స్ రద్దు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. అలాగే వాహనాలకు తప్పనిసరిగా ధ్రువపత్రాలు ఉండాలని, లేనిపక్షంలో వాటిని సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. లింగంపేట ఎస్సై చైతన్యకుమార్‌రెడ్డి, ఎల్లారెడ్డి, గాంధారి, నాగిరెడ్డిపేట, సదాశివనగర్, తాడ్వాయి ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

భిక్కనూరులో 30 వాహనాలు సీజ్

భిక్కనూరు: మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై సీఐ సంపత్ ఆధ్వర్యంలో భిక్కనూరు, దోమకొండ, బీబీపేట ఎస్సైలతో పాటు 30 మంది సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. నంబర్ ప్లేట్లు లేని 30 వాహనాలను సీజు చేయడంతోపాటు మద్యం సేవించి వాహనాలు నడిపిన ఐదుగురిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

మోపాల్‌లో మూడు..

మోపాల్: నంబర్ ప్లేట్లు లేని మూడు ద్విచక్రవాహనాలను సీజ్ చేసినట్లు ఎస్‌హెచ్‌వో గంగాధర్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పకుండా తమ వెంట ధ్రువపత్రాలు ఉంచాలని, లేని పక్షంలో వాహనాలను సీజ్‌చేస్తామన్నారు.

డిచ్‌పల్లి చెరువులో పడి ఒకరి మృతి



దత్తాద్రి (ఫైల్)

డిచ్‌పల్లి: మండలంలోని డిచ్‌పల్లి ఖిల్లా గ్రామానికి చెందిన మారుపాక దత్తాద్రి (61) ప్రమాదవశాత్తు చెరువులోపడి మృతి చెందినట్లు ఎస్సై యూ మహేశ్ మంగళవారం తెలిపారు. చేపలను వేటాడేందుకు సోమవారం మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన దత్తాద్రి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యు లు పలు చోట్ల వెతికారన్నారు. అయితే, మంగళవారం మధ్యాహ్నం చెరువులో దత్తాద్రి మృతదేహం కనిపించడంతో తమకు సమాచారం అందించారని తెలిపారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించామని, మృతుడి వీపుపై గాయాలు కనిపించడంతో బాధిత కుటుంబ సభ్యులు అనుమానాలు వ్యక్తం చేశారని ఎస్సై తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన ప్రైవేట్ బస్సు

- ఒకరి మృతి.. 28 మందికి గాయాలు



గాయాలపాలైన ప్రయాణికుడు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బస్సు ముందుభాగం



మృతుడు అఫ్సర్(ఫైల్)

కామారెడ్డి క్రైం: కామారెడ్డి జిల్లా కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున రోడ్డుపై ఆగి ఉన్న లారీని ప్రైవేటు బస్సు వెనుక నుంచి ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, 28 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆదిలాబాద్‌కు చెందిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 34 మంది ప్రయాణికులతో సోమవారం రాత్రి 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్‌కు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున దాదాపు 3 గంటల ప్రాంతంలో కామారెడ్డి సమీపంలోకి రాగానే క్యాసంపల్లి శివారులో జాతీయ రహదారిపై నిలిపి ఉంచిన లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న ఆదిలాబాద్‌లోని అంబేడ్కర్‌నగర్ కాలనీకి చెందిన అఫ్సర్‌ఖాన్ (25) మృతి చెందగా, మరో 28 మందికి గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులను జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బస్సు డ్రైవర్ షేక్ రఫీక్‌తోపాటు మరో ప్రయాణికుడు మొబీన్‌కు తీవ్ర గాయాలుకాగా వైద్యులు నిజామాబాద్‌కు రిఫర్ చేశారు. గాయాలపాలైన వారంతా ఆదిలాబాద్, నిర్మల్ ప్రాంతాలకు చెందిన వారే. అఫ్సర్‌ఖాన్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు.

కారు ఢీకొట్టిన ఘటనలో వృద్ధుడు..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని ఎర్రాపహాడ్ శివారులోని కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం కారు ఢీకొట్టిన ఘటనలో కరడ్‌పల్లి గ్రామానికి చెందిన పడమటి భీమయ్య(70) మృతి చెందాడు. ఎర్రాపహాడ్ శివారులో ఈతనాదులు కోస్తున్న భీమయ్యను వేగంగా దూసుకువచ్చిన కారు ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన భీమయ్యను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి, వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించగా, చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన కారులో ముగ్గురు యువకులు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు



ఘటనాస్థలంలో మనోహర్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని కామారెడ్డి–ఎల్లారెడ్డి రహదారిపై సోమవారం రాత్రి పశువులు అడ్డు రావడంతో ద్విచక్ర వాహనం అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో స్థానికుడు ఆవుల మనోహర్ గాయపడ్డాడు. ఆయనను కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అలాగే 4 రోజుల క్రితం రాత్రి వేళ కామారెడ్డి రోడ్డుపై పశువులు అడ్డు వచ్చి మరొకరు గాయాలపాలైనట్లు స్థానికులు తెలిపారు. పశువులు రాకపోకలకు అంతరాయం కల్గిస్తున్నాయని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు. అధికారులు స్పందించి పశువుల యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తా.. ఇద్దరికి గాయాలు



ఘటనాస్థలంలో క్షతగాత్రులు

సిరికొండ: గడ్కోల్ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడిన ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వివరాలు .. గడ్కోల్ శివారులో రాముడు ఒర్రెపై నిర్మిస్తున్న చెక్‌డ్యాం పనుల కోసం ట్రాక్టర్‌లో సామగ్రిని తరలిస్తున్నారు. గడ్కోల్ సమీపంలోకి రాగానే ట్రాక్టర్ అదుపు తప్పడంతో ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీలో కూర్చున్న వారిపై సామగ్రి పడటంతో లక్ష్మీ శ్రీనివాస్‌రావు, ఏడుకొండలు అనే ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

స్కూటీ డిక్కీలోని రూ.2లక్షలు చోరీ



బాధితుడు సాంబయ్య

భీమ్‌గల్: స్కూటీ డిక్కీలో నుంచి రూ.2లక్షలు చోరీ అయిన ఘటన భీమ్‌గల్ పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కమ్మర్‌పల్లి మండలం కోనసముందర్ గ్రామానికి చెందిన కొప్పెర సాంబయ్య మంగళవారం ఉదయం 11.45 గంటలకు భీమ్‌గల్‌కు వచ్చాడు. ఇంటి నిర్మాణం కోసం స్థానిక ఎస్‌బీఐ నుంచి రూ.2లక్షలు డ్రాచేసి స్కూటీ డిక్కీలో పెట్టుకున్నాడు. అనంతరం బస్టాండ్ ప్రాంతానికి వెళ్లి వాచ్ రిపేర్ చేయించుకున్నాడు. వాచ్‌ను పెట్టేందుకు స్కూటీ డిక్కీ తీయగా అందులో ఉంచి రూ.2లక్షలతోపాటు పాస్‌బుక్, ఆధార్, పాన్‌కార్డు కనిపించలేదు. బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బ్యాంకులోని సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించి సాంబయ్యను నలుగురు వ్యక్తులు వెంబడించినట్లు గుర్తించారు. సదరు వ్యక్తులే చోరీకి పాల్పడ్డారని నిర్ధారణకు వచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దాడి ఘటనపై విద్యుత్ అధికారుల ఫిర్యాదు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నగరంలోని టౌన్–2 పరిధిలో ఉన్న దుబ్బ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తున్న లైన్‌మెన్‌పై కార్పొరేటర్‌తోపాటు అతడి అనుచరులు దాడి చేసిన ఘటనను జిల్లా విద్యుత్ శాఖాధికారి రవీందర్ సీరియస్‌గా తీసుకున్నారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని డీఈ శ్రీనివాస్‌రావుతోపాటు ఏడీఈ తోట రాజశేఖర్‌ను ఆదేశించారు. సదరు లైన్‌మెన్‌తో మాట్లాడి దాడి చేసిన వారిపై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులపై దాడి చేయడం తగదని, ప్రజాప్రతినిధులైనా, సాధరణ వ్యక్తులైనా దాడులకు పాల్పడడం సరికాదన్నారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాల్సిందేనని అన్నారు.